సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 29 । మార్చి । 2024



టన్ను చీనీ రూ.25,500
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.25,500, కనిష్టంగా రూ. 12 వేలు పలికాయి.



కిలో టమాట రూ.13
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.13 పలికింది. మార్కెట్‌కు 150 టన్నుల సరుకు అమ్మకానికి వచ్చింది.

రంజాన్ వేళలు

శుక్రవారం	శనివారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.35	సెహరీ : 5.03



న్యూస్‌రీల్

రేపు అనంతకు సీఎం జగన్ రాక



అనంతపురం కార్పొరేషన్: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శనివారం జిల్లాకు రానున్నారు. ఈ మేరకు సీఎం కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. 'మేము సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా గుత్తికి సాయంత్రం 4 గంటలకు చేరుకుంటారు. పామిడి, గార్లదిన్నె, రాప్తాడు, ఇటుకలపల్లి మీదుగా రోడ్ షోలో పాల్గొంటారు. అదే రోజు రాత్రి 7.30 గంటలకు కృష్ణంరెడ్డి పల్లిలో బస చేయనున్నారు.

క్వింటా చింతపండు రూ.24 వేలు



మార్కెట్‌కు వచ్చిన చింతపండు

హిందూపురం అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో క్వింటా చింతపండు గరిష్టంగా రూ.24 వేలు పలికింది. మార్కెట్‌కు గురువారం 2,656 క్వింటాళ్ల సరుకు రాగా, ఈ–నామ్ పద్ధతిలో వేలం వేసినట్లు మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. అందులో కరిపులి రకం క్వింటా గరిష్టంగా రూ.24 వేలు, కనిష్టంగా రూ.8,100, సగటున రూ.10 వేల మేర పలికిందన్నారు. అలాగే ఫ్లవర్ రకం చింతపండు క్వింటా గరిష్టంగా రూ.11 వేలు, కనిష్టంగా రూ.4 వేలు, సగటున రూ.6 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగినట్లు ఆయన వెల్లడించారు. ఇక బోటు రకం చింతపండు క్వింటా గరిష్టంగా రూ.3 వేలు, కనిష్టం రూ.2,500 ప్రకారం పలికిందని వివరించారు.

పలు రైళ్ల రద్దు.. దారి మళ్లింపు



గుంతకల్లు: నైరుతి రైల్వే పరిధిలో జరుగుతున్న పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేయడంతో పాటు మరికొన్నింటిని దారి మళ్లించినట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 3 నుంచి 10 వరకూ కేఎస్ఆర్ బెంగళూరు–ధర్మవరం (06595/56) మధ్య నడుస్తున్న రైళ్లు రద్దు చేసినట్లు వివరించారు. ఏప్రిల్ 7,8 తేదీల్లో గౌరీబిదనూర్–ధర్మవరం మధ్య మాత్రమే రాకపోకలు సాగిస్తాయన్నారు. ఇక.. జైపూర్–మైసూర్ (12976) ఎక్స్‌ప్రెస్‌ను ఏప్రిల్ 1 నుంచి 8వ తేదీ వరకు గుంతకల్లు, బళ్లారి, రాయదుర్గం, ఆరిశికెరి, హసన్ మీదుగా దారి మళ్లించినట్లు తెలిపారు. కలబురిగి–బెంగళూరు (22231) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఏప్రిల్ 3 నుంచి 10వ తేదీ వరకు 5.20 గంటలు ఆలస్యంగా నడుస్తుందన్నారు. బెంగళూరు–కలబురిగి (22231) మరో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు 60 నిమిషాలు ఆలస్యంగా రాకపోకలు సాగిస్తాయని వివరించారు. ప్రయాణికులు సహరించాలని విజ్ఞప్తి చేశారు.

నృసింహుని రథోత్సవానికి ప్రత్యేక బస్సులు



కదిరి అర్బన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం ఈ నెల 30న నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా భక్తుల సౌకర్యార్థం కదిరి డిపో నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డీఎం మైనొద్దీన్ తెలిపారు. కదిరి డిపోలో ఉన్న 110 బస్సులకు అదనంగా హిందూపురం, మడకశిర, ధర్మవరం డిపోల నుంచి మరో 15 ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులు నడపనున్నట్లు పేర్కొన్నారు. కదిరి నుంచి గోరంట్ల మీదుగా హిందూపురానికి 20 బస్సులు, నల్లమాడకు 10, బెంగళూరుకు 15, పులివెందులకు 7, తలుపులకు 6 బస్సులు నడుపుతామన్నారు. ప్రయాణికులు ఎండవేడికి తట్టుకునేలా జీవిమానుకూడలి, వేమారెడ్డి సర్కిల్, బస్టాండ్, సరస్వతీ విద్యామందిరాల వద్ద ప్రత్యేక బస్సు షెల్టర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ప్రతి షెల్టర్ వద్ద ఇద్దరు పోలీసులు (ఆర్టీసీ కానిస్టేబుళ్లు), ఇద్దరు సేఫ్టీ డ్రైవింగ్ శిక్షకులు, ఇద్దరు వలంటీర్లు, సూపర్‌వైజర్‌ను నియమించినట్లు చెప్పారు. సమావేశంలో అసిస్టెంట్ డిపో మేనేజర్లు హరిత, హరిమోహన్,అసిస్టెంట్ రామకృష్ణ పాల్గొన్నారు.

గరుడ వాహనంపై నృసింహుడు



గరుడ వాహనంపై దర్శనమిస్తున్న ఖాద్రీశుడు

కదిరి: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. స్వామి వారు 10వ రోజు గురువారం మరోసారి గరుఢారూఢుడై తిరువీధుల్లో దర్శనమిచ్చారు. ఉత్సవాలకు అధిపతి అయిన బ్రహ్మ ప్రజల కోరిక మేరకు తన ఇష్ట వాహనమైన గరుత్మంతున్ని నారసింహునికి వాహనంగా మరోసారి పంపుతారు. దీన్నే ప్రజా గరుడసేవ.. మలి గరుడసేవ అని కూడా అంటారు. మోహినీ ఉత్సవంలో ముందు రోజు తిరువీధుల్లో ఊరేగిన శ్రీవారు రాత్రి 7 గంటలకు తిరిగి ఆలయానికి చేరుకున్నారు. నిత్యపూజలు, గ్రామోత్సవం అనంతరం మళ్లీ రాత్రి సమయంలో గరుడ వాహనంపై ఆలయ ప్రాంగణంలో కొలువుదీరారు. విశేషాలంకరణ ముగిసిన వెంటనే స్వామి వారికి ప్రధాన అర్చకులు దివ్య మంగళ హారతినిచ్చారు. అప్పటికే రాజగోపురం వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్న భక్తాదులు తమ ఇలవేల్పు దేవుడిని దర్శించుకున్నారు. తర్వాత స్వామి వారు గరుడ వాహనంపై తిరువీధుల్లో విహరించారు. భక్తుల కాలక్షేపం కోసం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నేడు గజ వాహనం

ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి శుక్రవారం రాత్రి ఐరావతంపై తిరువీధుల్లో తన భక్తులకు దర్శనమిస్తారు. ప్రజా గరుడసేవ ఉభయదారులుగా ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ రెడ్డెప్పశెట్టి కుటుంబ సభ్యులు వ్యవహరించారని ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు.



చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

కమ్మని ముద్ద!



- ప్రభుత్వ పాఠశాలల్లో వడ్డించేది 'జగనన్న గోరుముద్ద'
- అదనంగా రాగి జావా, చిక్కి
- కడుపు నిండా తింటున్న విద్యార్థులు
- తల్లిదండ్రులు హర్షం

ప్రభుత్వ బడుల్లో చదివే ఏ విద్యార్థి అర్ధాకలితో చదువుకోకూడదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వం జగనన్న గోరు ముద్ద కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. పోషకాలతో కూడిన భోజనాన్ని వడ్డించడంతో పాటు రాగిజావ , చిక్కీ కూడా విద్యార్థులకు ఇస్తున్నారు. తమ బిడ్డలు కడుపు నిండా భోజనం చేస్తుండటంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హిందూపురం: టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ బడుల్లో అమలు చేసిన మధ్యాహ్న భోజన పథకం లక్ష్యం నీరుగారిపోయింది. నీళ్ల చారు రుచిపచీ లేని వంటకాలతో విద్యార్థులు సరిగ్గా భోజనం చేసేవారు కూడా కాదు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మెనూలో సమూల మార్పులు చేపట్టడంతో విద్యార్థులతో సంతోషంగా మధ్యాహ్న భోజనాన్ని ఆరగిస్తున్నారు.

పక్కాగా పర్యవేక్షణ

జగనన్న గోరుముద్ద కార్యక్రమం ద్వారా విద్యార్థులకు అందించే భోజనం నాణ్యంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎప్పటికప్పుడు విద్యా కమిటీ అభిప్రాయాలు విద్యాశాఖ సేకరించి రోజుకో వంటకంతో నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నారు. రోజూ ఉపాధ్యాయులు వెళ్లి ఆహార పదార్థాలను పరిశీలించిన తర్వాతే విద్యార్థులకు భోజనాన్ని వడ్డిస్తున్నారు. గతంలో వంట ఏజెన్సీ నిర్వాహకులు రెండు మూడు సార్లు కోడిగుడ్లు సరఫరా చేసేవారు వాటిల్లో కొన్ని చెడిపోయి విద్యార్థులు తినేందుకు ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం వారంలో నాలుగు సార్లు విద్యార్థులకు కోడిగుడ్లు అందించాలని ఆదేశాలు ఇచ్చింది. దీని ప్రకారం విద్యార్థులకు వారానికి నాలుగు సార్లు గుడ్లను అందజేస్తున్నారు. ఏ వారంలో సరఫరా ఆయన గుడ్లను అదే వారంలో ఉపయోగించిలా వాటిపై గుర్తులు కూడా వేస్తున్నారు.

పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య

ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించేలా చర్యలు తీసుకోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో భోజనం చేసే విద్యార్థుల సంఖ్య బాగా పెరిగింది. పిల్లలు కూడా భోజనాన్ని ఇష్టంగా తింటున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులు ఎక్కువశాతం పేద విద్యార్థులే కావడంతో ప్రభుత్వం మెనూ పక్కాగా అమలయ్యేలా చూస్తోంది. పిల్లలను బడికి పంపుతున్న తల్లిదండ్రులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్న భోజనాన్ని సచివాలయ సంక్షేమ సహాయకులు కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.



మధ్యాహ్న భోజనాన్ని భుజిస్తున్న కల్లూరు సుబ్బారావు ఉన్నత పాఠశాల విద్యార్థినులు

మెనూ ఇలా...

సోమవారం:	పొంగల్ ఉడికించిన గుడ్డు, కూరగాయల పాలావ్, గుడ్డు కూర, చిక్కీ
మంగళవారం:	పులిహోర, టమాట పచ్చడి, దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు, రాగిజావ
బుధవారం:	కూరగాయాల అన్నం, బంగాళ దుంప కుర్మా, ఉడికించిన గుడ్డు, చిక్కి
గురువారం:	సాంబార్ బాత్, ఉడికించిన గుడ్డు, రాగిజావ
శుక్రవారం:	అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కి.
శనివారం:	ఆకుకూర అన్నం, పప్పుచారు, తీపి పొంగలి, రాగిజావ

జిల్లాలో 2,087 పాఠశాలలు

జిల్లా వ్యాప్తంగా 2,087 పాఠశాలలున్నాయి. వీటిలో 1.64 లక్షలపైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థికి రూ.5.45, ఉన్నత పాఠశాల విద్యార్థికి రూ.8.17 ప్రకారం ఖర్చు చెల్లిస్తున్నారు. దీంతో ఏజెన్సీ నిర్వాహకులు కూడా ఇబ్బంది లేకుండా భోజనాలను సిద్ధం చేస్తున్నారు.

రుచికరంగా వండుతున్నారు



ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం తింటున్నాను. వారానికి ఐదు రోజులు కోడిగుడ్లు ఇస్తున్నారు. రోజుకో కూర వడ్డిస్తున్నారు. గతంలో స్కూల్లో భోజనం తినాలనిపించేది కాదు. ఇప్పుడు ఇంటి వద్ద కంటే బడిలోనే రుచికరమైన భోజనం అందిస్తున్నారు. మా తల్లిదండ్రులు కూడా సంతోషంగా బడికి పంపిస్తున్నారు.
– హుస్నాబాను, 9వతరగతి, హిందూపురం

జావ, చిక్కీ ఇస్తున్నారు



మా బడిలో రాగిజావ, చిక్కీ కూడా ఇస్తున్నారు. రోజూ వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనం ఎంతో రుచికరంగా ఉంటుంది. ముందు స్కూల్‌లో భోజనం నచ్చేదికాదు. ఇప్పుడు ప్రతిరోజూ ఇక్కడే తింటున్నా. కోడిగుడ్లు, కూరలు అన్ని బాగుంటున్నాయి.
– బాబు, 8వ తరగతి, హిందూపురం

సంతోషంగా తింటున్నారు



ప్రభుత్వ ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం విద్యార్థులకు అందిస్తున్నాం. పాఠశాలల్లో విద్యార్థుల కంటే ముందుగా ఉపాధ్యాయులు వెళ్లి భోజనంలో లోటుపాట్లను పరిశీలిస్తారు. రోజూ ఒక తరగతి చొప్పున విద్యార్థులతో మాట్లాడి భోజన రుచి గురించి తెలుసుకుంటున్నారు. విద్యార్థులు కూడా సంతోషంగా భోజనం తింటున్నారు.
– పెన్నోబిలం, పీఎస్ఓ హైస్కూల్ హెచ్.ఎం, హిందూపురం

నేడు 'శుభ శుక్రవారం'

- ప్రత్యేక ప్రార్థనలకు సిద్ధమైన చర్చిలు



పుట్టపర్తి టౌన్: క్రీస్తు అనగానే క్షమ, కరుణ గుణాలు గుర్తుకొస్తాయి. పాపులను పరిశుద్ధులను చేసేందుకు కరుణామయుడైనా ఏసుక్రీస్తు శిలువపై తన ప్రాణాలు వదిలినరోజే గుడ్‌ఫ్రైడే (శుభ శుక్రవారం). 40 రోజులుగా క్రైస్తవులు ఉపవాస దీక్షలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శుభ శుక్రవారం సందర్భంగా క్రీస్తు త్యాగాన్ని గుర్తుచేసుకుంటూ చర్చీల్లో ప్రత్యేక ఉపవాస ప్రార్థనలు నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రమైన పుట్టపర్తితో పాటు అన్ని చర్చీల్లో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ప్రధానోపాధ్యాయుడి సస్పెన్షన్

కదిరి అర్బన్: పాఠశాలలో నాడు నేడు పథకంలో మిగిలిపోయిన ఇనుప కడ్డీలను అక్రమంగా అమ్ముకునేందుకు యత్నించిన ప్రధానోపాధ్యాయుడు సస్పెండ్ అయ్యాడు. కదిరి మండలం సున్న పుగుట్లతండా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులును సస్పెండ్ చేస్తూ డీఈఓ మీనాక్షి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 25న రాత్రి పాఠశాలలోని ఇనుప కడ్డీలను వాహనంలో వేసుకుని గుజిరీ దుకాణంలో విక్రయించేందుకు శ్రీనివాసులు యత్నించాడు. గ్రామస్తులు అడ్డుకోవడంతో విషయం బయట పడింది. తెలుగుదేశం పార్టీ కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందికుంట వెంకటప్రసాద్ గ్రామస్తులతో పంచాయితీ చేసి, కడ్డీలను పాఠశాలలోనే వదిలేసి, శ్రీనివాసులుపై ఎలాంటి చర్యలు లేకుండా చేసేందుకు యత్నించారు. ఆఖరికి హెచ్‌ఎం సస్పెండ్ అయ్యారు.

నోటికి తాళం ... సమస్యలకు పరిష్కారం



నోటికి తాళాలతో భక్తులు

పావగడ: స్వారమ్మదేవి, శంకరలింగేశ్వర స్వామి భక్తులు తమ సమస్యల పరిష్కారానికి ఎంతటి కఠినమైన ఆచారాలను పాటిస్తుంటారు. ఇందులో భాగంగానే పావగడ తాలూకాలోని మద్దె, కరెక్యాతనహళ్లి ఉమ్మడి గ్రామాలకు చెందిన స్వారమ్మదేవి, శంకరలింగేశ్వరస్వామి జాతర మహోత్సవాల సందర్భంగా గురువారం నిర్వహించిన బాయి బీగ (నోటికి తాళం) కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున బాయి బీగ ఆచారం నేపథ్యంలో రెండు దవడలకు ఇనుప తీగను చెక్కించుకుని నోటికి తాళం వేసుకుని సమస్యలు తీర్చాలంటూ స్వారమ్మదేవికి మొరపెట్టుకున్నారు. అలాగే సమస్యలు పరిష్కారమైన మరికొందరు మొక్కులు చెల్లించుకున్నారు.

బ్యాంకుకు శఠగోపం

- రూ.1.67 కోట్లు బంధువుల ఖాతాలకు మళ్లింపు
- ఫీల్డ్ ఆఫీసర్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు



కదిరి టౌన్: పనిచేస్తున్న బ్యాంకుకే శఠగోపం పెట్టాడో ఉద్యోగి. ఏకంగా రూ.1.67 కోట్లను బంధువుల ఖాతాలకు మళ్లించేశాడు. ఆలస్యంగా గుర్తించిన సదరు బ్యాంకు ఉన్నతాధికారులు ఆఖరికి పోలీసులను ఆశ్రయించారు. పట్టణ సీఐ పుల్లయ్య తెలిపిన వివరాలమేరకు ... ధర్మవరానికి చెందిన వెంకటనాయుడు కదిరిలోని స్టేట్ బ్యాంకులో వ్యవసాయశాఖ ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. అన్ని విషయాలపై అవగాహన ఉన్న అతనికి దుర్బుద్ధి పుట్టింది. బ్యాంకుకు సంబంధించిన డబ్బును మళ్లించి సొమ్ము చేసుకుందామని ప్లాన్ వేశాడు. ఇందులో భాగంగానే తన బంధువులకు సంబంధించిన బ్యాంకు ఖాతాలను సేకరించాడు. బ్యాంకు ఓడీ ఖాతా నుంచి 12 మందికి చెందిన బ్యాంకు ఖాతాలకు రూ.1.67 కోట్లను మళ్లించాడు. వారి ఖాతాల నుంచి మళ్లీ తన స్నేహితుడైన భాను ప్రవీణ్‌రెడ్డి ఖాతాను ఆ మొత్తం డబ్బును ట్రాన్స్‌ఫర్ అయ్యేలా చేశాడు. అయితే క్రికెట్ బెట్టింగ్‌లు తదితర వాటికి అలవాటు పడ్డ భాను ప్రవీణ్‌రెడ్డి రూ.1.67 కోట్లను ఖర్చు పెట్టేశాడు. వెంకటనాయుడు గత ఏడాది జూన్ నుంచి విడతల వారీగా బ్యాంకును మోసం చేస్తూ వచ్చాడు. అయితే డిసెంబర్‌లో బ్యాంకులో ఆడిటింగ్ జరగడంతో వెంకటనాయుడు మోసం బయట పడింది. ఈ వ్యవహారానికి సంబంధించి తాజాగా ఎస్‌బీఐ బ్యాంకు రీజినల్ మేనేజర్ వెంకటేశ్వరరావు పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ పుల్లయ్య పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించండి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

హిందూపురం టౌన్: ఎన్నికల నాటికి పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని వసతులు కల్పించాలని అధికారులను ఎలక్టోరల్ నమోదు అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. గురువారం మండల పరిధిలోని 158, 159, 160, 161 పోలింగ్ కేంద్రాలను, అలాగే పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ కంజాక్షన్, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డిలకు పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఏవైనా సమస్యలు ఉంటే యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి పరిష్కరించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో లైట్లు, నీరు, మరుగుదొడ్లు, ర్యాంప్ సౌకర్యం కచ్చితంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ రెడ్డి శేఖర్, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల కార్యవర్గం ఎంపిక



జిల్లా కార్యవర్గం సభ్యులు

పుట్టపర్తి అర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. గురువారం పుట్టపర్తిలోని గణేష్ సర్కిల్‌లో ఉన్న షాదీఖానాలో ఉద్యోగుల కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్రశాఖ సభ్యులు రఘురామనాయుడు, అనంతపురం జిల్లా అధ్యక్షుడు గోపీకృష్ణ, వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో ఈ కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడిగా వీబీ భాస్కర్‌రెడ్డి, సెక్రటరీగా మహేశ్వరరెడ్డి, ట్రెజరర్‌గా నారాయణరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా నాగేంద్రనాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సుందరరాజును ఎంపిక చేశారు. అలాగే ఉపాధ్యక్షుడిగా డాక్టర్ చెన్నారెడ్డి, విశ్వతేజ, శ్రీనివాసులు, హేమేనాయక్, గోవిందప్ప, రమేష్ రెడ్డి, బాబాఫకృద్దీన్, ,జాయింట్ సెక్రటరీలుగా శ్రీదేవి, మల్లికార్జున, తిరుపాల్, గోపీనాయక్, రామచంద్రారెడ్డి, చంద్రమౌళి, వెంకటేషులను ఎంపిక చేశారు. కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ఉద్యోగులు హాజరయ్యారు.

అలరించిన సంగీత కచేరీ



సంగీత కచేరీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రశాంతి నిలయం: సత్యసాయిని కీర్తిస్తూ చక్కటి భక్తిగీతాలతో నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను అలరించింది. గురువారం సాయంత్రం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహా సమాధి చెంత మిరుపురి సంగీత కళాశాల విద్యార్థులు సంగీత కచేరీ నిర్వహించారు. సత్యసాయి ఆధ్యాత్మిక, ప్రేమ తత్వాన్ని చాటుతూ నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులు సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు.

సరి'హద్దులు మీరకుండా'

- ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఐదు చెక్‌పోస్టుల ఏర్పాటు
- కర్ణాటక నుంచి వచ్చే ప్రతి వాహనంపై ప్రత్యేక నిఘా
- అక్రమంగా మద్యం, నగదు, వస్తువుల సరఫరాను అడ్డుకోవడమే లక్ష్యం

హిందూపురం/అర్బన్: జిల్లాలో ప్రశాంత ఎన్నికలు నిర్వహించేలా పోలీసు, రవాణా, సెబ్, ఆదాయపన్నుల శాఖ అధికారులు సంయుక్త చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా సరిహద్దులు దాటి మద్యం, నగదు, గిఫ్ట్ సామగ్రి ఏపీ జిల్లాలోకి అక్రమంగా చొరబడకుండా 24 గంటలూ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో కర్ణాటక సరిహద్దున ఉన్న జిల్లాలోని నియోజకవర్గాల పరిధిలో ఐదు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులతో పాటు మరో నాలుగు అంతర్‌జిల్లా చెక్‌పోస్టులతో నిఘా కట్టుదిట్టం చేశారు. మూడు శాఖల అధికారుల నేతృత్వంలో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. వీటితో పాటు 19 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. నియోజకవర్గానికి 2 నుంచి 3 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు చొప్పున కేటాయించి ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ రూ.44.40 లక్షల నగదు, రూ.32.66 లక్షల విలువ చేసే 5,210 లీటర్ల మద్యం సీజ్ చేశారు.

ఓటర్లలో ఆత్మస్థైర్యం పెంపొందేలా..

ఇప్పటికే సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించిన పోలీస్ శాఖ ఆయా ప్రాంతాల్లో ఓటర్లలో ఆత్మస్థైర్యం పెంపొందించే చర్యలకు శ్రీకారం చుట్టింది. గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా వ్యాప్తంగా 1,571 పోలింగ్ కేంద్రాల్లో 258 సమస్యాత్మక కేంద్రాలున్నట్లుగా గుర్తించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తులను బైండోవర్ చేస్తున్నారు. సబ్ డివిజన్ల వారీగా పోలీసు అధికారులతో ఎస్పీ మాధవరెడ్డి ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు. ఈ క్రమంలో పోలీస్ పికెటింగ్‌ల ఏర్పాటు, కార్డన్ సెర్చ్ తదితరాలను ముమ్మరం చేశారు. కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తూ ప్రశాంత ఎన్నికలకు సహకరించాలంటూ ప్రజలను చైతన్య పరుస్తున్నారు.



కొడికొండ చెక్‌పోస్టులో వాహన తనిఖీలు చేస్తున్న ప్రత్యేక బలగాలు

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి తనిఖీల్లో పట్టుబడిన వివరాలు
మద్యం : 5, 210 లీటర్లు (రూ.32.66లక్షలు)
నగదు సీజ్ : రూ.44.40 లక్షలు
మొత్తం విలువ : రూ. 77.06 లక్షలు

చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం

జిల్లాలోకి అక్రమంగా మద్యం, నగదు, గిఫ్ట్ సామగ్రి చొరబడకుండా పోలీసు, రవాణా, సెబ్, ఆదాయపన్నుల శాఖ అధికారులు సంయుక్త చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో ఐదు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. అలాగే జిల్లాలోని పుట్టపర్తి, కదిరి, ధర్మవరం ప్రాంతాల్లో మరో నాలుగు అంతర్‌జిల్లా చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్టుల్లో మూడు శాఖల అధికారులతో పాటు 24 గంటలూ విధుల్లో ఉంటున్నారు. ఒక్కో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద బీఎస్ఎఫ్ బెటాలియన్‌ను మోహరింపజేశారు. రూ. 50 వేలకు మించి నగదు తరలిస్తూ పట్టుబడితే దానికి సరైన ఆధారాలు చూపాల్సి ఉంటుంది. లేదంటే ఆదాయపన్నుల శాఖ అధికారులు వెంటనే సీజ్ చేస్తున్నారు. అక్రమంగా మద్యం తరలించకుండా సెబ్, సివిల్ పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. అక్రమ రవాణాకు వినియోగించిన వాహనాలను రవాణాశాఖ అధికారులు సీజ్ చేస్తున్నారు. అధికారులకు పట్టుబడిన వెంటనే సరైన ఆధారాలు చూపించకపోతే వెంటనే చర్యలకు దిగుతుండడం గమనార్హం. ఒక్కసారి అధికారులు సీజ్ చేస్తే... తర్వాత వాటికి సరైన ఆధారాలు చూపించి విడిపించుకోవడంలో చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం



ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా సివిల్, కేంద్ర బలగాలు, సెబ్ సిబ్బందితో పటిష్ట చర్యలు చేపట్టాం. జిల్లాలో 107, 109, 110 సీఆర్‌పీసీ కింద రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్, గత ఎన్నికల కేసుల్లో ఉన్న వారిని ఇప్పటికే 2,800 మందిని ముందస్తుగా బైండవర్ చేశాం. అక్రమ మద్యం, నాటుసారా తయారీ, విక్రయాల కేసుల్లో జనవరి నుంచి ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా 853 కేసులు నమోదు చేసి 800 మందిని అరెస్ట్ చేశాం. 89 వాహనాలు సీజ్ చేశాం. 18,597 లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నాం. ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) ఉల్లంఘనలపై ఎప్పటికప్పుడు కేసులు నమోదవుతున్నాయి. నగదు, గిఫ్ట్ సామగ్రి తరలించేవారు వాటికి సరైన ఆధారాలు తప్పనిసరిగా చూపించాలి.

– మాధవరెడ్డి, ఎస్పీ

క్లుప్తంగా

బావిలో పడి యువకుడి మృతి


మృతుడు మారుతి

హిందూపురం అర్బన్: మద్యం మత్తులో అదుపు తప్పి బావిలో పడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... హిందూపురం మండలం మరువపల్లికి చెందిన మారుతి (24) మద్యానికి బానిసగా మారి నిరంతరం మత్తులో జులాయిగా తిరిగేవాడు. తల్లితో కలసి ఉంటున్న మారుతి మంగళవారం నుంచి కనిపించకుండా పోయాడు. కుటుంబసభ్యులు గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం ఉదయం మరువపల్లి శివారులోని దిగుడుబావిలో మారుతి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించారు. మద్యం మత్తులో అదుపు తప్పి బావిలో పడి మృతి చెంది ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రైతుపై ఎలుగుబంటి దాడి

కళ్యాణదుర్గం రూరల్: పొలం పనుల్లో నిమగ్నమైన రైతుపై ఎలుగుబంటి దాడి చేసింది. వివరాలు... కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన ఈడిగ గోవిందరాజులు గురువారం ఉదయం ఉప్పొంక గ్రామ సమీపంలో ఉన్న తన పొలంలో పనుల్లో నిమగ్నమయ్యాడు. ఆ సమయంలో అటవీ ప్రాంతం నుంచి ఎలుగుబంటి ఒక్కసారిగా గోవిందరాజులుపై దాడి చేసింది. గమనించిన సమీప పొలాల్లోనే రైతులు మూకుమ్మడిగా కేకలు వేయడంతో ఎలుగుబంటి బెదిరి అటవీ ప్రాంతంలోకి పరుగు తీసింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన గోవిందరాజులును వెంటనే స్థానిక సీహెచ్‌సీకి తరలించారు.

భంభం స్వామి సమాధిని తాకిన సూర్యకిరణాలు


భంభం స్వామి సమాధి, చిత్రపటాన్ని సూర్యకిరణాలు తాకిన దృశ్యం

రాయదుర్గం టౌన్: పట్టణంలోని భంభం స్వామి దర్గాలో భంషేక్ అబ్దుల్ స్వాముల సమాధిని సూర్య కిరణాలు తాకాయి. గురువారం ఉదయం 6.30 గంటలకు సమాధితో పాటు చిత్రపటాన్ని సూర్యకిరణాలు తాకడంతో ఆ ప్రాంతమంతా పసిడి వర్ణం నెలకొంది. ఈ దృశ్యం చూసిన భక్తులు తన్మయత్వానికి లోనయ్యారు. దర్గా నిర్వాహకులు బషీర్ అహమ్మద్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

రెండు రోజుల్లో బిల్లులు అప్‌లోడ్ పూర్తి చేయండి

- పంచాయతీరాజ్ చీఫ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న పీఆర్ చీఫ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి

అనంతపురం సిటీ: మరో రెండు రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులకు సంబంధించిన బిల్లులన్నీ వెంటనే అప్‌లోడ్ చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ చీఫ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి ఆదేశించారు. గురువారం అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల అధికారులతో అనంతపురంలోని రీజినల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం కింద సబ్ డివిజన్ల వారీగా మంజూరైన, చేపట్టిన, పూర్తయిన పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడువులోగా పనులన్నీ పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లులన్నీ అప్‌లోడ్ చేయాలన్నారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ఏమాత్రం జాప్యం చేయరాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా భావిస్తున్న గ్రామ సచివాలయాలు, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాల భవన నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయంలో వంద శాతం పూర్తి చేసి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన శింగనమల, అనంతపురం రూరల్ డీఈఈ రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డిని చీఫ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో అనంతపురం పీఆర్ ఎస్ఈ ఈరాస్వామి, ఈఈ చంద్రశేఖర్, డీఈఈలు రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా పీఆర్ హెడ్ మురళీ, పీఏలు గురుమూర్తి, శ్రీనివాసమూర్తి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు రాజన్న, మురళీ, రజనీకాంత్, వెంకటరమణ, హరి, మధు, మల్లికార్జున, ఏఈ హుస్సేన్‌బాషా, లక్ష్మీదేవి, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వార్డెన్ మృతి


నాగరాజు (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో హాస్టల్ వార్డెన్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... చెన్నేకొత్తపల్లికి చెందిన పాముల నాగరాజు (57).. తాడిమర్రిలోని బీసీ బాలుర వసతి గృహం సంక్షేమ అధికారిగా పనిచేస్తున్నారు. బుధవారం రాత్రి విధులు ముగించుకున్న ఆయన ధర్మవరం మీదుగా స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. చెన్నేకొత్తపల్లి మండలం నాగసముద్రం గ్రామ బస్టాండ్ సమీపంలోకి చేరుకోగానే నియంత్రణ కోల్పోవడంతో వాహనం నేరుగా రోడ్డు మధ్యలో ఉన్న గుంతలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన నాగరాజును అటుగా వెళుతున్న వారు గుర్తించి 108 అంబులెన్స్ ద్వారా ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు కుటుంబసభ్యులు బెంగళూరుకు తీసుకెళ్లారు. అక్కడి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం ఆయన మృతి చెందారు. మృతునికి భార్య వెంకటలక్ష్మి, కుమారులు మణికంఠ, చరణ్, కుమార్తె వెంకటేశ్వరమ్మ ఉన్నారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నెట్టికంటుడిని దర్శించుకున్న అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్మన్

గుంతకల్లు రూరల్: రాష్ట్ర రియల్ ఎస్టేట్ అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్మన్ ఎం.గంగారావు గురువారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ మర్యాదలతో ఈఓ భద్రాజీ, అర్చకులు స్వాగతం పలికారు. విశేష పూజల అనంతరం స్వామి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

క్రమశిక్షణ మీరితే చర్యలు

- వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ సిద్ధాంతాలకు లోబడే ఎవరైనా పనిచేయాల్సి ఉంటుందని, అతిక్రమించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. గురువారం ఆయన వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ రాప్తాడు నియోజకవర్గ నాయకులతో కలసి విలేకరులతో మాట్లాడారు. బోయ రాజారాం, ఈశ్వరయ్యకు వైఎస్సార్ సీపీ సముచిత స్థానం ఇచ్చిందన్నారు. కానీ వారు ఇటీవల పార్టీ నియమాలను ఉల్లంఘిస్తూ వ్యవహరిస్తున్నారన్నారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గౌరవ ప్రతిష్టలకు భంగం కలిగేలా విమర్శలు చేయడాన్ని ఆయన ఖండించారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతమైతే పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామన్నారు. వైఎస్ జగన్ పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందారన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలోనే బడుగులకు రాజ్యాధికారం దక్కిందన్నారు. ఎవరెన్ని విమర్శలు చేసినా అన్ని వర్గాల ప్రజలకు మేలు చేయడమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమన్నారు. రాప్తాడు వైస్ ఎంపీపీ రామాంజనేయులు, రామగిరి సర్పంచ్ మీనుగ నాగరాజు, జెడ్పీటీసీ నాగార్జున, మండల కన్వీనర్ శేఖర్, నాయకులు పసుపుల ఆదినారాయణ మాట్లాడుతూ... వైఎస్సార్ సీపీలో కొనసాగుతూ ఎన్నికల వేళ పార్టీకి ద్రోహం చేసేలా బోయ రాజారాం, ఈశ్వరయ్య వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి నాయకత్వంలో బోయ, కురుబలకు రాజకీయ ప్రాధాన్యత దక్కిందనేందుకు తామే సాక్ష్యమన్నారు. రాప్తాడులో 30 ఏళ్ల పాటు సాగిన పరిటాల కుటుంబం అరాచకానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అడ్డుకట్ట వేశారన్నారు. పరిటాల కుటుంబంతో బిల్లే ఈశ్వరయ్య లోపాయికార ఒప్పందాలు చేసుకుని నీచ రాజకీయాలకు తెరలేపాడని మండిపడ్డారు. మరోసారి రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.

బావమరిదే కిడ్నాపర్!

- డబ్బుల కోసమే చికెన్ సెంటర్ నిర్వాహకుడి కిడ్నాప్
- నిందితుల అరెస్ట్..రిమాండ్


కిడ్నాపర్ల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వాసుదేవన్

కొత్తచెరువు: వ్యసనాలకు బానిసైన ఓ వ్యక్తి డబ్బు కోసం బావనే కిడ్నాప్ చేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గంటల వ్యవధిలోనే ఈ కేసును ఛేదించారు. వివరాలను గురువారం డీఎస్పీ వాసుదేవన్ కొత్తచెరువు పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి కేసు పూర్వాపరాలు వివరించారు. మైలాపురం భానుచంద్ర అలియాస్ బాలు పెనుగొండలో పంచర్ షాపు నిర్వహించేవాడు. వ్యసనాలకు బానిసైన అతను భారీగా డబ్బు ఖర్చు చేసేవాడు. ఈ క్రమంలో జల్సాలు తీర్చుకునేందుకు అవసరమైన డబ్బు కోసం వరసకు బావ అయిన కొత్తచెరువుకు చెందిన చికెన్ వ్యాపారి ఉప్పర చలపతిని కిడ్నాప్ చేయాలని భావించాడు. తన స్నేహితులైన మెండిగట్ల శ్రావణ్, హరిజన సూరి, ఇరగంరెడ్డి రుషికేశవరెడ్డి, పంగా విష్ణువర్ధన్, ఇరగంరెడ్డి గంగాధర్ రెడ్డి, శివ గంగాధర్‌రెడ్డి, కందుకూరి శివకిషోర్‌రెడ్డితో కలిసి ఈనెల 24న తెల్లవారుజామున చికెన్ సెంటర్‌కు వెళ్తున్న ఉప్పర చలపతిని కారులో కిడ్నాప్ చేశారు. బాధితుని బంధువుల సమాచారంతో అప్రమత్తమైన పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా గంటల వ్యవధిలోనే ఆచూకీ కనిపెట్టారు. ముదిగుబ్బ సమీపంలో ఉన్నట్లు గుర్తించి అక్కడికి వెళ్లగా...నిందితులు చికెన్ వ్యాపారి ఉప్పర చలపతిని వదిలి పరారయ్యారు. దీంతో డీఎస్పీ వాసుదేవన్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ రాజరమేష్ బాధితుని ద్వారా వివరాలు సేకరించారు. సిబ్బందితో కలిసి నిందితులకోసం గాలింపు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో గురువారం నిందితులు ముదిగుబ్బ మండలం రాళ్ల అనంతపురం క్రాస్ వద్ద ఉన్నట్లు తెలుసుకుని అక్కడికి వెళ్లి ప్రధాన సూత్రధారి మైలాపురం భానుచంద్రతో పాటు మెండిగట్ల శ్రావణ్, హరిజన సూరి, ఇరగంరెడ్డి రుషికేశవరెడ్డి, పంగా విష్ణువర్ధన్‌ను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి కిడ్నాప్‌కు ఉపయోగించిన కారు, 8 సెల్‌ఫోన్లు, రూ.1,800 నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్‌కు ఆదేశించారు. ఈ కేసులో మరో మగ్గురు నిందితులు ఇరగంరెడ్డి గంగాధర్‌రెడ్డి, శివ గంగాధర్‌రెడ్డి, కందుకూరి శివకిషోర్‌రెడ్డి పరారీలో ఉన్నారని, త్వరలోనే వారినీ అరెస్టు చేస్తామని డీఎస్పీ వాసుదేవన్ వెల్లడించారు. కిడ్నాప్ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన పోలీస్ సిబ్బందికి ఎస్పీ మాధవ్‌రెడ్డి అభినందించారు.

ఘనంగా సోమఘట్ట నరసింహస్వామి రథోత్సవం


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న టీఎన్ దీపిక


రథాన్ని లాగుతున్న భక్తులు

చిలమత్తూరు: మండలంలోని సోమఘట్టలో వెలసిన మధుగిరి లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతుడై నారసింహుడు రథంలో కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక, వేణురెడ్డి దంపతులు, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ అభ్యర్థి బోయ శాంతమ్మ, చౌళూరు మధుమతిరెడ్డి, ఎంపీపీ పురుషోత్తమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెన్నానదిలో అస్థిపంజరం

- కర్నూలు జిల్లా వాసిదిగా గుర్తింపు
- వివాహేతర సంబంధం కారణంగా 40 రోజుల క్రితం హత్య
- కేసు దర్యాప్తులో వెల్లడించిన నిందితులు
- పామిడి పెన్నానదిలో అస్థిపంజరాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు


అస్థి పంజరాన్ని పరిశీలిస్తున్న దేవనకొండ సీఐ శ్రీనివాసులు, తదితరులు

పామిడి: వివాహేతర సంబంధం కారణంగా కర్నూలు జిల్లాలో 40 రోజుల క్రితం హతమైన వ్యక్తి... గురువారం పామిడి పెన్నానది సమీపంలో అస్థిపంజరమై తేలాడు. కర్నూలు జిల్లా దేవనకొండ సీఐ శ్రీనివాసులు తెలిపిన మేరకు... ఈ ఏడాది ఫిబ్రవరి 16న కర్నూలు జిల్లా దేవనకొండ మండలం గుండ్లకొండ గ్రామానికి చెందిన కురుబ లక్ష్మన్న (55) కనిపించకుండా పోయాడు. పలు ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు దేవనకొండ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో లక్ష్మన్న భార్య పద్మావతి, కుమారుడు వెంకటేష్ ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు తమదైన శైలిలో విచారణ చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. వివాహేతర సంబంధం కారణంగా లక్ష్మన్నను హతమార్చినట్లు పోలీసుల ఎదుట వారు అంగీకరించారు. తమ బంధువు గిడ్డి మల్లయ్యతో కలసి వెంకటేష్ ఓ వాహనంలో లక్ష్మన్న మృతదేహాన్ని తీసుకువచ్చి పామిడి బైపాస్‌లోని పెన్నానది శివారున ఉన్న ఓ మామిడితోట సమీపంలో కంపచెట్ల మధ్య పడేశారు. ఈ సమాచారంతో నిందితులను వెంటబెట్టుకుని సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు గురువారం పామిడికి చేరుకున్నారు. ముళ్ల పొదల మధ్య అస్థిపంజరాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అక్కడే పంచనామ నిర్వహించి, ఖననం చేశారు. ఘటనకు సంబంధించి పద్మావతి, వెంకటేష్, గిడ్డి మల్లయ్యపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

కుంకుమ, మల్లెల గుబాళింపు





కదిరి: కుంకుమ.. మల్లెలు అంటే మగువలకు ఎంతో ఇష్టం. అయితే ఇందులోనూ కదిరి ప్రాంతానికి చెందిన కుంకుమ, మల్లెలు, దవణం అంటే చాలు దక్షిణ భారతదేశం మొత్తం ఆసక్తి చూపుతుంది. ఈ ప్రాంతంలో సాగవుతున్న మల్లెలు పొరుగు రాష్ట్రాలకు పెద్ద ఎత్తున ఎగుమతి అవుతుంటాయి. పూల విక్రేతలు సైతం ప్రత్యేకంగా 'కదిరి మల్లెలు' అంటూ కేక వేసి మరీ కొనుగోలుదారులను ఆకట్టుకుంటుంటారు. ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలు జరిగే పక్షం రోజులూ ఈ మల్లెలతోనే శ్రీవారిని అలంకరిస్తారు. కదిరి ప్రాంతంలో పండించే దవణాన్ని సెంట్లు, అత్తర్ తయారీలో వినియోగిస్తున్నారు. ప్రధానంగా ఇక్కడి నుంచి ముంబయి, బెంగళూరు తదితర మెట్రో నగరాలకు ఎగుమతి చేస్తుంటారు. ప్రత్యేక సువాసనను వెదజల్లే కదిరి కుంకుమ మగువల మదిని దోచేస్తోంది. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులు ఈ మూడింటిని తప్పనిసరిగా కొనుగోలు చేసి, తమ ప్రాంతాలకు తీసుకెళుతుంటారు. కదిరి కుంకుమ దైవ పూజల్లో, శుభకార్యాల్లో ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. ముత్తైదువుల నుదుటున ఉన్న కదిరి కుంకుమ ఆ పరిసర ప్రాంతాల్లో సువాసన వెదజల్లుతూ ఉంటుంది. అందుకే బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన భక్తులు తమవెంట కదిరి మల్లెలు, కదిరి కుంకుమ, కదిరి దవణం విధిగా తీసుకెళ్తుంటారు. వీటిపై కదిరి ప్రాంత వాసులను అడిగితే ఈ ప్రాంత నేల స్వభావం అలాంటిదని, అందుకే కదిరి మల్లెలు, కదిరి దవణం, కదిరి కుంకుమ అంతగా గుభాళిస్తుంటాయని చెబుతున్నారు.